క్లుప్తంగా

నిత్యావసర సరుకులు పంపిణీ



కొత్తపేట(కంచికచర్ల) : మండలంలోని కొత్తపేటలో 100 వరద బాధిత కుటుంబాలకు ప్రకాశంజిల్లా ఇంకొల్లు గ్రామానికి చెందిన చర్చ్ ఆఫ్ క్రైస్ట్ మిషనరీస్ ప్రతినిధులు ఉసురుపాటి ఇశ్రాయేలు, ఉసురుపాటి అశోక్‌కుమార్ సౌజన్యంతో శనివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. విజయవాడ సింగ్ నగర్‌లో వరద బాధితులకు నిత్యావస సరుకులు పంపిణీ చేసినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో పాస్టర్లు ముప్పాళ్ల రాజు, క్రీస్తు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం



పెనుగంచిప్రోలు:మునేరు అవతల గండ్లు పూడ్చేందుకు కొద్దిరోజులుగా గ్రావెల్‌ను తరలిస్తున్న టిప్పర్ నుంచి శనివారం స్థానిక టౌన్ సెంటర్‌లో పెద్దరాళ్లు రోడ్డుపై పడ్డాయి. ఆసమయంలో అటుగా ఎవరూ రాకపోకలు సాగించకపోవడంతో పెద్దప్రమాదమే తప్పిందని గ్రామస్తులు ఊపిరిపీల్చుకున్నారు. టిప్పర్ డ్రైవర్లు నిర్ణీత పరిమాణంలో తగిన జాగ్రత్తలతో గ్రావెల్‌ను తరలించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఘనంగా హిందీ దివస్ వేడుకలు



ముక్త్యాల(జగ్గయ్యపేట): గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ దివస్ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా హిందీ ఉపాధ్యాయుడు చింతలపూడి హేమంత్‌కుమార్‌ను ఉపాధ్యాయులు, విద్యార్థులు సత్కరించారు. హిందీ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. తెలుగుభాషతోపాటు హిందీపై కూడా అవగాహన కలిగి ఉండాలని విద్యార్థులకు సూచించారు. ఉపాధ్యాయులు రమేష్‌బాబు, ఎల్‌వి సత్యనారాయణ, ప్రవీణ్, రాఘవాచారి, ఉపాధ్యాయులు కోటేశ్వరరావు, వీబీ చారి పాల్గొన్నారు.

నందిగామ మండలంలో..

నందిగామ టౌన్: మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం హిందీ దివస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. చందాపురం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో హిందీ దివస్ వేడుకల్లో భాగంగా హిందీ ఉపాధ్యాయుడు అహ్మద్‌ప్యారాను ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేంద్ర, నాగరాజు, కోటేశ్వరరావు, విజయ్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

డిపోలో సమస్యలు పరిష్కారిస్తాం: ఎమ్మెల్యే

జగ్గయ్యపేట: ఆర్టీసీ డిపోలో సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ హామీ ఇచ్చారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోలోని గ్యారేజ్‌ను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్యారేజీలో సిబ్బందికి మరుగుదొడ్లు, విశ్రాంతి గదులు, తాగునీరు తదితర సౌకర్యాలు అరకొరగా ఉండటంతో వారు పడుతున్న ఇబ్బందులను తనదృష్టికి తెచ్చారన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానని చెప్పారు. డిపోకు కొత్త బస్సులు కావాలని డ్రైవర్లు సూచించగా, విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని ఎమ్మెల్యే వివరించారు. కార్యక్రమంలో డిపో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ప్రథమ చికిత్సలపై అవగాహన అవసరం

లబ్బీపేట(విజయవాడతూర్పు): అత్యవసర సమయంలో అందించే ప్రథమ చికిత్సలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ జి.సమరం అన్నారు. ప్రపంచ ఫస్ట్ ఎయిడ్ డే సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం నలంద డిగ్రీ కళాశాలలో అవగాహనా సదస్సు జరిగింది. ఈ సదస్సులో డాక్టర్ సమరం మాట్లాడుతూ.. అత్యవసర సమయంలో కార్డియో పల్మనరీ రీసస్‌సిటేషన్(సీపీఆర్) చేసే విధానాన్ని తెలుసుకోవడం వలన ప్రాణాలు నిలబెట్టవచ్చునన్నారు. ఏ ప్రమాదం జరిగినా అత్యవసరంగా అందించాల్సిన ప్రాథమిక చికిత్స అందరికీ తెలియడం ఎంతో ఉపయోగమని చెప్పారు. వైద్య సదుపాయం అందేలోపు ఫస్ట్ ఎయిడ్ అందించడం వలన చాలా వరకూ ప్రాణాపాయం లేకుండా చూడవచ్చునన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ క్యాడెట్లను యూత్ రెడ్ క్రాస్ తరపున వరద బాధితులకు సహాయ, సహకారాలు అందించినందుకు అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ, రెడ్‌క్రాస్ మెంబర్ రాధిక తదితరులు పాల్గొన్నారు.

గణనాథుడికి విశేష పూజలు



పెనుగంచిప్రోలు మండలం ముండ్లపాడులో కొలువుదీరిన గణనాథుడు



నవాబుపేట వినాయకమండపంలో పూజలు చేస్తున్న గ్రామస్తులు

జగ్గయ్యపేట: వినాయకచవితి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మండపాల్లోని గణనాథులు ఎనిమిదోరోజు శనివారం ప్రత్యేక పూజలు అందుకున్నారు. జగ్గయ్యపేట మండలంలోని గౌరవరం, అనుమంచిపల్లి, గండ్రాయి, జయంతిపురం తదితర గ్రామాలతోపాటు జగ్గయ్యపేట పట్టణంలోని కమలాసెంటర్, కోదాడ రోడ్డు, పాతగడ్డ ప్రాంతం, బ్రాహ్మణబజార్‌లోని వినాయక మండపాల్లో కొలువుదీరిన గణనాథులను భక్తులు ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. పూజల అనంతరం ఆయా మండపాల వద్ద స్వామివారి లడ్డూకు వేలం పాట నిర్వహించారు. బ్రాహ్మణబజారులోని వినాయకుడి లడ్డూను రూ.16,200లకు అనుమాల సాయి అనే భక్తులు కై వసం చేసుకున్నారు. స్వామివారి మండపాల వద్ద నిర్వహించిన లడ్డూ వేలంపాటలో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు మండలంలో..

పెనుగంచిప్రోలు: వినాయకచవితి నవరాత్రుల ఉత్సవాలను పెనుగంచిప్రోలు మండలంలో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. స్థానిక శ్రీతిరుపతమ్మ అమ్మవారి ఆలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక గణపతి మండపం వద్ద శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన మండపాల వద్ద శ్రీసత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పెనుగంచిప్రోలు ఈశ్వరమ్మ ఆలయం వద్ద అన్నదానం చేశారు.

కంచికచర్ల మండలంలో...

కంచికచర్ల : మండలంలోని అన్ని గ్రామాల్లో వినాయకచవితి ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. వినాయకుడి విగ్రహాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కంచికచర్లలోని వసంతకాలనీ, పశువుల ఆసుపత్రి రోడ్డులో ఏర్పాటు చేసిన బాలవినాయకుడికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన చేశారు. తీగెల బజార్, రామాలయం పెద్దబజార్, హనుమాన్‌పేట, పోలీస్‌స్టేషన్ సెంటర్, మోడల్‌కాలనీ తదితర ప్రాంతాల్లో గణేషుడిని అధికసంఖ్యలో భక్తులు సందర్శించి పూజలు నిర్వహించారు.

నందిగామ మండలంలో..

నందిగామ టౌన్: గణపతి నవరాత్రి మహోత్సవాలు కన్నుల పండువగా సాగుతున్నాయి. మహోత్సవాల్లో భాగంగా నందిగామ పట్టణంలోని ఆయా ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన గణనాథులకు భక్తులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ముక్కోటి మహా మండపంలోని లంబోదరునికి విశేష పూజలు, అర్చనలు చేశారు. మంటపంలో ఏర్పాటు చేసి మహాలక్ష్మీ అమ్మవారికి సుగంధ ద్రవ్యాలతో తిరువంజనం కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని సామూహిక కుంకుమార్చనలు చేశారు. వాసవీ మార్కెట్, రైతుపేట, నెహ్రూనగర్, గాంధీ సెంటర్, కూరగాయల మార్కెట్ తదితర ప్రాంతాలలో కొలువుదీరిన గణనాథులను అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని పూజలు చేశారు.

వీరులపాడు మండలంలో..

వీరులపాడు: మండలంలోని జుజ్జూరు, అల్లూరు, పెద్దాపురం, వీరులపాడు, జయంతి తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహాల వద్ద భక్తులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక పూజల అనంతరం తొమ్మిదో రోజు ఆదివారం స్వామివార్ల విగ్రహాలను నిమజ్జనానికి తరలించేందుకు మండపాల నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.



కంచికచర్ల పశువుల ఆసుపత్రి రోడ్డులో ..



దేవిరెడ్డివారి వీధిలో గణనాథుడికి పూజలు చేస్తున్న భక్తులు



జగ్గయ్యపేటలో వేలం ద్వారా వినాయకుడి లడ్డూను కైవసం చేసుకున్న భక్తులు

లోక్‌అదాలత్‌లో 119 కేసులు పరిష్కారం

కంచికచర్ల : నందిగామ కోర్టు ప్రాంగణంలో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. లోక్‌అదాలత్‌లో భాగంగా చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.లోక్‌అదాలత్‌లో భాగంగా 119 కేసులు పరిష్కరించినట్లు 16వ అదనపు జిల్లా న్యాయమూర్తి డి.శేషయ్య తెలిపారు. పరిష్కరించిన కేసుల్లో సివిల్ కేసులు ఆరు, వాహన ప్రమాదబీమా కేసులు 16, క్రిమినల్ కేసులు 87, వివాహసంబంధ కేసులు మూడు, చెక్‌బౌన్స్ కేసులు మూడు, ప్రింటగేషన్ కేసులు మూడు ఉన్నట్లు వివరించారు. ప్రమాద బీమా కేసులకు సంబంధించి బాధితులకు నష్టపరిహారంగా రూ.99.95లక్షలు చెల్లించినట్లు తెలిపారు. సీనియర్ సివిల్ జడ్జి వి.లక్ష్మీరాజ్యం, ప్రిన్సిపల్ సివిల్‌జడ్జి షేక్ రియాజ్, అదనపు సివిల్‌కోర్టు జడ్జి ఎం.రేష్మ పాల్గొని ఆయా కేసులను పరిష్కరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు నంద్రు బాబూవిద్యాసాగర్, అడిషనల్ పీపీ రంగారావు, మట్టా ప్రసాద్, న్యాయవాదులు పాల్గొన్నారు.

'అమ్రితసాయి'కి ఎన్‌బీఏ గుర్తింపు



మాట్లాడుతున్న కరస్పాండెంట్ రామ్మోహనరావు

కంచికచర్ల : పరిటాల అమ్రితసాయి ఇంజినీరింగ్ కళాశాలలో ఎలిజిబిలిటి ఉన్న అన్ని విభాగాలకు ఎన్‌బిఏ–టైర్ 1(వాషింగ్‌టన్ ఎకార్డ్) గుర్తింపు వచ్చిందని కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ కె.రామ్మోహనరావు శనివారం తెలిపారు. కళాశాల అవలంభించే అకడమిక్ ప్రోగ్రాం అండ్ కరిక్యులం అంతర్జాతీయ స్థాయిలో ఉండటంతో ఎన్‌బీఏ గుర్తింపు లభించినట్లు వివరించారు. డిజిటల్ ప్రోగ్రామ్స్‌తోపాటు ఉన్నత ప్రమాణాలను పాటిస్తూ అడ్వాన్స్ ల్యాబ్స్ ద్వారా విద్యార్థులకు ఇస్తున్న శిక్షణను పరిశీలించిన ఎన్‌బీఏ టీమ్ కళాశాలకు ఈ గుర్తింపును ఇచ్చిందన్నారు.

కళాశాల వైస్ చైర్మన్ డాక్టర్ కె.సాయిమనోజ్ మాట్లాడుతూ తమ కళాశాలలో పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఐ.ఓ.టీ, డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్, సైబర్ ఫోరెన్సిక్, బిగ్‌డేటా, క్రిష్టో ల్యాబ్స్ వంటి అడ్వాన్స్ ల్యాబ్స్ ద్వారా విద్యార్థులకు ఉత్తమ శిక్షణ ఇస్తున్నామన్నారు. ఇప్పటికే అటానమస్ నాక్ గ్రేడే అక్రిడేషన్‌తో ముందుకు సాగుతున్నామన్నారు. ఎన్‌బీఏ గుర్తింపు సాధనకు కారణమైన అన్ని విభాగాల అధిపతులు, అధ్యాపకులు, అధ్యాపకేతరుల సిబ్బందికి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం శశిధర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరద నీటిలోనే కాంప్లెక్స్ సెల్లార్లు



మసీదు కాంప్లెక్స్ సెల్లార్‌లో నిలిచిన నీరు

జగ్గయ్యపేట: ఇటీవల వచ్చిన వరదలు, భారీ వర్షాల కారణంగా జగ్గయ్యపేట పట్టణంలోని పలు కాంప్లెక్స్ సెల్లార్లు ఇంకా వరదనీటిలోనే ఉన్నాయి. ఊరచెరువు సమీపంలో ఉండటంతో పలు కాంప్లెక్స్‌ల్లోకి నీరు కదలడం లేదు. రైతుబజార్ సమీపంలోని జామియా మసీదు సెల్లార్ కాంప్లెక్స్ నుంచి రెండువారాలుగా నీరు కదలడం లేదు. దీంతో సెల్లార్‌లోని దుకాణాలు వరదనీటిలోనే ఉన్నాయి. దీంతో దుకాణాలు తెరుచుకోవడం లేదు. సమీపంలోని చెరువులో నీరు తగ్గితే తప్ప దుకాణాలు తీసే పరిస్థితి లేదని దుకాణాదారులు చెబుతున్నారు.అంటున్నారు. మసీదు కాంప్లెక్స్ యాజమాన్యం స్పందించి చర్యలు తీసుకోవాలని దుకాణాదారులు కోరుతున్నారు.

బాధితులను ఆదుకోవాలి : రైతుసంఘం



వరద ఉధృతికి దెబ్బతిన్న పొలాలను పరిశీలిస్తున్న రైతుసంఘం నాయకులు

జయంతిపురం(జగ్గయ్యపేట):వరదల కారణంగా నష్టపోయిన రైతులు, ప్రజలను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆంజనేయులు కోరారు. జయంతిపురం ఎస్సీ కాలనీలో సీఐటీయు, సీపీఎం సంయుక్త ఆధ్వర్యంలో వరద బాధితులకు చేపట్టిన అన్నదాన కార్యక్రమాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూదవాడ, రెడ్డినాయక్‌తండ, అన్నవరం, జయంతిపురం గ్రామాల్లో పాలేటికి వచ్చిన వరద కారణంగా ప్రజలకు భారీగా ఆస్తి నష్టం వాటిల్లిందన్నారు.. అధికారులు వరద బాధితుల వివరాల నమోదు సర్వేను తూతూమంత్రంగా చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బాధితులను ఆదుకోవాలని కోరారు. అనంతరం ఆయన నీటమునిగిన పంట పొలాలను పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు సైదులు, కోట కృష్ణ, గౌస్, శేషు, రాంప్రసాద్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

• రైతులకు విద్యుత్ కష్టాలు



పెనుగంచిప్రోలు మండలం అనిగండ్లపాడు వద్ద పొలాల్లో విరిగిపడి ఉన్న విద్యుత్ స్తంభం



వరద ఉధృతికి అన్నవరం పొలంలో ధ్వంసమైన మోటార్లు, విద్యుత్ స్తంభాలు



కె.పొన్నవరం వద్ద సాగునీరు అవసరమైన కూరగాయల తోట



ముచ్చింతాల వద్ద దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్, నేల కూలిన స్తంభాలు

మునేరు, పాలేరు వరదల కారణంగా జగ్గయ్యపేట నియోజకవర్గంలోని ఆయా గ్రామాల పరిధిలో ఉన్న వ్యవసాయపొలాల్లో పలు విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు కొట్టుకుపోయాయి. జగ్గయ్యపేట సబ్‌డివిజన్ పరిధిలో 200కుపైగా విద్యుత్‌స్తంభాలు నేలకొరిగాయి. వరద ఉధృతికి పలుచోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు కూడా కొట్టుకుపోయాయి. దీంతో నియోజకవర్గంలోని పలు గ్రామాలకు విద్యుత్‌సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడటంతో విద్యుత్‌శాఖ అధికారులు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి గ్రామాలకు విద్యుత్‌సరఫరాను పునరుద్ధరించారు. అయితే వ్యవసాయ భూములకు సంబంధించి ఏర్పాటు చేసిన విద్యుత్‌లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు మాత్రం ఇంకా పూర్తికాలేదు. దీంతో వ్యవసాయ అవసరాలకు విద్యుత్ సదుపాయం లేక రైతులు ఇబ్బందిపడుతున్నారు. బోర్లు, వ్యవసాయ బావుల వద్ద ఉన్న మోటార్లకు విద్యుత్ కోసం పదిరోజులుగా రైతులు ఎదురుచూస్తున్నారు. పొట్టదశలో ఉన్న వరి పొలాలు, కూరగాయల తోటలకు నీరుపెట్టేందుకు విద్యుత్ సరఫరా లేక పంటలు దక్కవేమోనని రైతులు దిగులుపడుతున్నారు. విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు త్వరితగతిన వ్యవసాయపొలాల్లో దెబ్బతిన్న విద్యుత్‌లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లకు మర్మతులు చేపట్టి, త్వరితగతిన విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు.

– పెనుగంచిప్రోలు, జగ్గయ్యపేట



ముచ్చింతాల వద్ద నేలకూలిన విద్యుత్ స్తంభం, తెగిపడిన విద్యుత్ తీగలు



పెనుగంచిప్రోలు సమీపంలో పడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్, స్తంభాలు

పరిశోధనల్లో ఏఐ, ఎంఎల్ కీలకపాత్ర

వరంగల్ ఎన్‌ఐటీ ప్రొఫెసర్ శ్యామ్

లబ్బీపేట(విజయవాడతూర్పు): బయోలాజికల్ సైన్స్, డ్రగ్ డిస్కవరీ, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ వంటి పలు సంస్థల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ), మెషిన్ లెర్నింగ్(ఎంఎల్) నూతన సాంకేతిక మార్పులు, అభివృద్ధిలో కీలకంగా ఉన్నట్లు వరంగల్ ఎన్‌ఐటీ ప్రొఫెసర్ డాక్టర్ పి.శ్యామ్ అన్నారు. నగరంలోని శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం, ఏఐసీటీఇ ట్రెనింగ్ అండ్ లెర్నింగ్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్(ఐఓటీ), ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ), సైబర్ సెక్యూరిటీ అనే అంశాలపై వారం రోజుల పాటు నిర్వహించిన సదస్సు శనివారం ముగిసింది.

ముగిసిన సదస్సు..

ఈ సదస్సులో పలువురు నిపుణులు ఆధునిక సమాజంలో టెక్నాలజీ అభివృద్ధి, వాటి ప్రాముఖ్యత గురించి పలు ప్రాంతాల నుంచి వచ్చిన నిపుణులు వివరించారు. చివరి రోజు సదస్సులో డాక్టర్ పి.శ్యామ్ ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ ప్రాధాన్యతను వివరించారు. అన్ని రంగాల్లో ఈ టెక్నాలజీ ఉనికిని తెలియజేశారు. వారం రోజుల పాటు నిర్వహించిన ఈ సదస్సులో అధ్యాపకులు, 67 మంది పీజీ విద్యార్థినులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.కల్పన, స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ ఆర్.మాధవి, ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ డాక్టర్ మోహన రూప ఎస్‌వీడీ, కో ఆర్డినేటర్ డాక్టర్ వి.సంధ్యాలక్ష్మి, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ఎం.ప్రవీణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.హారిక, అధ్యాపకులు పాల్గొన్నారు.

రాజకీయ కక్ష సాధింపు తగదు



విద్యార్థులతో కలిసి ర్యాలీ చేస్తున్న సీఐటీయూ నాయకులు

జుజ్జూరు(వీరులపాడు): రాజకీయ కక్ష సాధింపు చర్యలు మానుకోకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని సీఐటీయూ నాయకుడు కటారపు గోపాల్ అన్నారు. మండలంలోని జుజ్జూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీ నిర్వాహకురాలు షేక్ మాజాన్‌బీని తొలగించడాన్ని నిరసిస్తూ విద్యార్థులతో కలిసి శనివారం ఆయన ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు, హెల్పర్లు తదితర చిరుద్యోగులపై రాజకీయ వేధింపులకు పాల్పడటం సమంజసం కాదన్నారు. రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా తొలగించిన చిరుద్యోగులందరినీ తక్షణమే విధుల్లోకి తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజనపథకం నిర్వాహకులు, హెల్పర్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపాలి

మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్డీఏ కూటమిలో భాగస్వామిగా ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్రంపై వత్తిడి తెచ్చి విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపాలని మాజీ మంత్రి, రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు డిమాండ్ చేశారు. ప్రెస్‌క్లబ్‌లో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. రుణభారం చూపించి స్టీల్ ప్లాంట్‌ను విక్రయించేందుకు కేంద్రప్రభుత్వం చూస్తోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిపక్షంలో ఉండగా విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంఘీభావం తెలిపారని గుర్తుచేశారు. ఇప్పుడు అధికారంలో ఉండడంతోపాటు కేంద్రంలో భాగస్వామిగా ఉన్నారని, ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపాలని, ఇందు కోసం ప్రధాని మోదీ, అమిత్‌షాతో మాట్లాడాలని సూచించారు. ప్రైవేటీకరణను అడ్డుకోకపోతే ప్రజలు క్షమించబోరని తేల్చిచెప్పారు. సమావేశంలో రిటైర్డ్ ఐఏఎస్ బండ్ల శ్రీనివాస్, సీఐటీయూ నాయకుడు నర్సింగరావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఏచూరికి ఘననివాళి



ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

నందిగామ టౌన్: దేశంలోని కమ్యూనిస్టులకే కాకుండా వామపక్ష, ప్రజాస్వామ్య, లౌకిక శక్తులందరికి ఏచూరి సీతారాం స్ఫూర్తిప్రదాత అని వాకర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు చిరుమామిళ్ల చైతన్యకుమార్, మన్నెం దాసు పేర్కొన్నారు. వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఏచూరి సీతారాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోని ప్రజాస్వామ్య, లౌకిక శక్తులను ఏకం చేసేందుకు ఏచూరి సీతారం అహర్నిశలు కృషి చేశారని గుర్తు చేశారు. ఏచూరికి నివాళులర్పించినవారిలో సీఐటీయూ నాయకుడు కటారపు గోపాల్, అసోసియేషన్ సభ్యులు మన్నెం శ్రీరామ్మూర్తి, చెరుకుమల్లి పిచ్చయ్య, చిరుమామిళ్ల హరి, మహంకాళి రామారావు, రాంబాబు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఉన్నారు.

పశుగ్రాసం అందజేయాలని వినతి

నందిగామ టౌన్: ఇటీవల కురిసిన వర్షాలు, సంభవించిన వరదలకు పశుగ్రాసం కొట్టుకుపోవడంతో పశువులకు గ్రాసం లేక అవస్థలు పడుతున్నామని పలువురు పశుపోషకులు ఆవేదన వ్యక్తం చేశారు. పాడి పరిశ్రమను ఆదుకునేందుకు ప్రభు త్వం పశుగ్రాసాన్ని పంపిణీ చేయాలని కోరుతూ పశుపోషకులు శనివారం నందిగామ పశువైద్యాధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నందిగామ, మునగచర్లకు చెందిన పశుపోషకులు కృష్ణచైతన్య, కార్తిక్, శ్రీను, ప్రసాద్ మాట్లాడుతూ పశుగ్రాసం కొరతతో పాలదిగుబడి తగ్గిపోతుందన్నారు. పశువులకు సరిపడ ఎండుగడ్డి, పచ్చిమేత లభించక అవస్థలు పడుతున్నా అధికారులు మాత్రం కనీసం స్పందించడం లేదన్నారు. క్షేత్రస్థాయిలో నష్టం అంచనాలను పూర్తిగా నమోదు చేయడం లేదని విమర్శించారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి పశుగ్రాసాన్ని పంపిణీ చేయాలని వారు కోరారు.